# పారిస్ ఒలింపిక్స్ వద్ద 'ఇండియా హౌజ్'

### ఐవోఏ భాగస్వామ్యంతో రిలయన్స్ ఏర్పాటు



ముంబై, జూన్ 26: మునుపెన్నడూ లేని విధంగా ఈసారి పారిస్ ఒలింపిక్స్ సమీపంలో 'ఇండియా హౌజ్' ఏర్పాటవుతున్నది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) భాగస్వామ్యంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్నది. ఒలింపిక్స్‌లో వందేండ్ల భారత ప్రాతినిథ్యాన్ని స్మరించుకుంటూ దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భారతీయ చరిత్ర, టెక్నాలజీ-డిజిటలైజేషన్‌లో సాధిస్తున్న ప్రగతి, సాంస్కృతిక, క్రీడా వారసత్వ విశేషాలనూ ప్రదర్శించనున్నారు. ఈ మేరకు బుధవారం ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష, ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) సభ్యురాలు నీతా అంబానీ తెలిపారు. ఇక పారిస్‌లోని పార్క్ డీ లా విలేట్ వద్ద ఉండే ఈ ఇండియా హౌజ్.. ఒలింపిక్స్ క్రీడలకు వెళ్లే జాతీయ బృందానికి ఓ సొంతిల్లు అనుభూతిని కలిగిస్తుందన్న ఆశాభావాన్నీ ఈ సందర్భంగా వారు వ్యక్తం చేశారు. అలాగే క్రీడా ప్రముఖులను కలుసుకునేందుకు సందర్శకులకూ ఓ వేదిక అవుతుందని చెప్పారు. కాగా, జూలై 26న పారిస్‌లో ఒలింపిక్స్ మొదలవుతున్న విషయం తెలిసిందే. ఆగస్టు 11 వరకు ఇవి జరుగుతాయి.

# మేఘా ఇంజనీరింగ్‌కు 13 వేల కోట్ల కాంట్రాక్ట్

హైదరాబాద్, జూన్ 26: రాష్ర్టానికి చెందిన ప్రముఖ మౌలికసదుపాయాల సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరో అతి పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నది. కర్ణాటకలోని కైగా వద్ద 1400 మెగావాట్ల ఎలక్ట్రికల్ అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐఎల్) పిలిచిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అగ్రస్థానంలో నిలిచింది. ఈపీసీ పద్ధతిన నిర్మించనున్న ఈ అణు విద్యుత్ కేంద్ర నిర్మాణ భారీ కాంట్రాక్టును మేఘా దక్కించుకున్నది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అణు ఇంధనశాఖ పరిధిలోని ఎన్‌పీసీఐఎల్ ఇంజినీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతిలో ఈ రియాక్టర్ల నిర్మాణానికి గతేడాది మే నెలలోనే టెండర్లను పిలిచింది. ఈ బిడ్లను బుధవారం తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువ కోట్ చేసిన మెయిల్ తొలి స్థానంలో నిలిచినట్లు కంపెనీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్అండ్‌టీ, భెల్ కూడా పాల్గొన్నాయి. ఈ రెండు సంస్థలు కూడా ఎక్కువ కోట్ చేయడంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. కానీ, మేఘా ఇంజినీరింగ్ రూ.12,799.92 కోట్ల ధరను కోట్ చేసి ఈ భారీ కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ భారీ కాంట్రాక్టును దక్కించుకోవడంతో సంస్థ అణు ఇంధన రంగంలోకి అడుగుపెట్టినట్లు అయిందని, ఇదొక మైలురాయి అన్నారు.



# రెడ్డీస్ చేతికి ఎన్ఆర్‌టీ

హైదరాబాద్, జూన్ 26: అంతర్జాతీయ కన్జ్యూమర్ హెల్త్‌కేర్ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రముఖ ఫార్మా సంస్థ రెడ్డీస్ ల్యాబ్ మరో సంస్థను కొనుగోలు చేసింది. నికోటినెల్, దాని అనుబంధ పోర్ట్‌ఫోలియో ఉత్పత్తులను హస్తగతం చేసుకున్నది. అంతర్జాతీయ ఎన్ఆర్‌టీ బ్రాండ్ నికోటినెల్, నికాబేట్, హబిట్రోల్, థ్రైవ్ వంటి బ్రాండ్లు ఇక రెడ్డీస్ పరిధిలోకి రానున్నాయి. ఒప్పందం విలువ రూ.5 వేల కోట్లకు పైనే. ఈ ఒప్పందం ఈ ఏడాది చివరి త్రైమాసికం నాటికి పూర్తికానున్నది.


# ఎల్‌టీఐ మైండ్‌ట్రీ నుంచి వైదొలిగిన నాయక్



న్యూఢిల్లీ, జూన్ 26: ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ చైర్మన్ పదవికి ఏఎం నాయక్ రాజీనామా చేశారు. దీంతో కంపెనీ నూతన చైర్మన్‌గా ఎస్ఎన్ సుబ్రమణ్యన్ నియమితులయ్యారు. బుధవారం కంపెనీ 28వ వార్షిక సాధారణ సమావేశంలో నాయక్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. దీంతో ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎన్ సుబ్రమణ్యన్‌కు పదోన్నతి కల్పించింది. ఈ నెల 27 నుంచి ఈ నియామకం అమలులోకి రానున్నది.

# స్పెక్ట్రమ్ వేలం అట్టర్ ఫ్లాప్

### ఆసక్తి చూపని టెలికం సంస్థలు



- 7 రౌండ్లలో వచ్చిన బిడ్లు రూ.11,341 కోట్లే
- రూ.1,000 కోట్లు కూడా పెట్టని రిలయన్స్ జియో
- మొత్తం అమ్ముడుపోయింది 141 మెగాహెట్జ్‌లే
- రెండో రోజు మధ్యలోనే వేలాన్ని ఆపేసిన అధికారులు
- కేంద్ర ప్రభుత్వానికి తప్పని నిరాశ

న్యూఢిల్లీ, జూన్ 26: దాదాపు రెండేండ్ల తర్వాత చేపట్టిన స్పెక్ట్రమ్ వేలం.. పూర్తిగా రెండు రోజులు కూడా కొనసాగలేకపోయింది. దేశీయ టెలికం సంస్థలు ఈసారి పెద్దగా ఆసక్తి చూపలేదు మరి. తొలిరోజు నుంచే ఈ సంకేతాలు కనబడగా.. రెండోరోజు అది విస్పష్టమైంది. మంగళవారం వేలం ప్రక్రియ మొదలవగా.. మొత్తం 5 రౌండ్లలో సుమారు రూ.11,000 కోట్ల స్పెక్ట్రమ్ కోసం బిడ్లు వచ్చాయి. ఇక రెండో రోజైన బుధవారం 2 రౌండ్లలో రూ.350 కోట్ల స్పెక్ట్రమ్ కోసమే బిడ్లు దాఖలైయ్యాయి. దీంతో చేసేదేమీలేక సంబంధిత అధికారులు మొదలైన కాసేపటికే (ఉదయం 11:30 గంటలకు) వేలాన్ని ఆపేస్తున్నట్టు ప్రకటించేశారు. ఈ క్రమంలోనే మొత్తం 7 రౌండ్లలో రూ.11,340.78 కోట్ల విలువైన 141.4 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రమ్ కోసమే బిడ్లు వచ్చినట్టు అధికారిక ప్రకటన విడుదలైంది. నిజానికి ఈసారి వేలంలో 10,500లకుపైగా మెగాహెట్జ్‌ల (10.5 గిగాహెట్జ్) స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. దీని కనీస విలువ రూ.96,238 కోట్లు. అయితే వచ్చిన బిడ్లు ఇందులో 12 శాతానికే సమానం కావడం గమనార్హం. ఇక అమ్ముదామనుకున్న స్పెక్ట్రమ్‌లో 2 శాతానికి సరిపడా గిరాకీ కూడా రాలేదు. ఇది మోదీ సర్కారుకు తీవ్ర నిరాశనే మిగిల్చింది.

**భారతీ ఎయిర్‌టెల్ టాప్**

ఈ వేలంలో ప్రైవేట్ రంగ టెలికం సంస్థలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు పాల్గొన్నాయి. ఇందులో రూ.6,856.76 కోట్ల విలువైన 97 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రమ్ కోసం బిడ్డింగ్ వేసి భారతీ ఎయిర్‌టెల్ టాప్ బిడ్డర్‌గా నిలిచింది. దాదాపు రూ.3,510.4 కోట్ల బిడ్లతో 30 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రమ్ కొని వొడాఫోన్ ఐడియా రెండో స్థానంలో ఉండగా, రూ.973.62 కోట్ల బిడ్డింగ్‌తో 14.4 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రమ్ తీసుకొని దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో ఆఖరు స్థానంలో స్థిరపడినట్టు అధికారిక ప్రకటన చెప్తున్నది. ఇక అమ్ముడుపోయిన స్పెక్ట్రమ్‌లో దాదాపు 70 శాతం ఎయిర్‌టెలే కొన్నది. 900, 1,800, 2,100 మెగాహెట్జ్‌ల్లోని స్పెక్ట్రమ్‌ను సొంతం చేసుకున్నది సంస్థ. ఇందులోనే ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ రూ.1,001 కోట్లతో 15 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రమ్‌ను దక్కించుకున్నది. కాగా, 6 సర్కిళ్లలో ఎయిర్‌టెల్ స్పెక్ట్రమ్, 2 సర్కిళ్లలో వొడాఫోన్ ఐడియా స్పెక్ట్రమ్ గడువులు తీరిపోతుండటం వల్లే ఈసారి ఈ రెండు సంస్థలు స్పెక్ట్రమ్ కొనుగోళ్లకు ముందుకొచ్చాయని తెలుస్తున్నది. అప్పుల భారంతో సతమతమవుతున్నా వొడాఐడియా మాత్రం 4జీ సేవలను మెరుగుపర్చడానికే ఈ వేలంలో పాల్గొన్నట్టు చెప్తున్నారు. లేకపోతే ఈమాత్రం ఆదరణ కూడా రాదన్న అభిప్రాయాలు ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. ఇక మొత్తం 8 ఫ్రీక్వెన్సీల్లోని రేడియో తరంగాలను ఈసారి వేలంలో అమ్మకానికి పెట్టారు. వీటిలో 800, 900, 1,800, 2,100, 2,300, 2,500, 3,300 మెగాహెట్జ్‌లతోపాటు 26 గిగాహెట్జ్ శ్రేణులున్నాయి.


**ఇదీ సంగతి..**

స్పెక్ట్రమ్ వేలం ఇంతలా ఫ్లాప్ షో కావడానికి కారణం.. దేశీయ టెలికం కంపెనీల దృష్టి, వ్యూహాలు, విధానాలు, లక్ష్యాలు వేరే ఉండటమేనని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే ఉన్న స్పెక్ట్రమ్ రెన్యువల్‌కే టెల్కోలు ఇష్టపడుతున్నారని, కొత్తగా మరింత స్పెక్ట్రమ్‌ను అందిపుచ్చుకోవాలని కోరుకోవడం లేదని అంటున్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణ, అందుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకే టెల్కోలు తమ పెట్టుబడులను మళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాము ఊహించినట్టుగానే ఈసారి స్పెక్ట్రమ్ వేలానికి ఆదరణ కరువైనట్టు ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. టెలికం సంస్థలు ముందుగా చేసిన అరకొర డిపాజిట్లతోనూ ఈసారి వేలం ఫ్లాప్ షోనేనని తేలిందంటున్నారు. ఇదిలావుంటే తొలిరోజు సాయంత్రం వరకు 900, 1,800 మెగాహెట్జ్ బ్యాండ్లలో రేడియో తరంగాల కోసమే బిడ్లు ఎక్కువగా వచ్చాయని టెలికం శాఖ వెల్లడించింది. అయితే మూడు సర్కిళ్లలో 2,100 మెగాహెట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్‌కూ డిమాండ్ వచ్చినట్టు వివరించింది. కాగా, 2022లో జరిగిన స్పెక్ట్రమ్ వేలం 7 రోజులు సాగింది. సూపర్ హిట్టైన ఈ ఆక్షన్‌కు టెలికం సంస్థల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో రూ.1.5 లక్షల కోట్లకు పైగా విలువైన 5జీ స్పెక్ట్రమ్ అమ్ముడుపోయింది. రూ.88,078 కోట్లతో సగానికిపైగా స్పెక్ట్రమ్‌ను దక్కించుకొని జియో సంస్థ టాప్ బిడ్డర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. నాడు ఎయిర్‌టెల్ (రూ.43,084 కోట్లు), వొడాఫోన్ ఐడియా (రూ.18,799 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

*అమ్మకానికి పెట్టిన స్పెక్ట్రమ్ 10,500 మెగాహెట్జ్‌లు*
*అమ్ముడుపోయింది 141.4 మెగాహెట్జ్‌లే*
*వేలం ద్వారా కేంద్రం ఆశించిన మొత్తం రూ.96,238 కోట్లు*
*వచ్చిన బిడ్లు రూ.11,340.78 కోట్లే*
*వేలంలో ప్రభుత్వ రంగ సంస్థలకు నో ఎంట్రీ*
*బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌పై మరోమారు చిన్నచూపు*

# ఆగని సూచీల పరుగు

### మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి మార్కెట్లు



ముంబై, జూన్ 26: స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ రికార్డు స్థాయిలో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధికంగా లాభపడటంతో సూచీలు మరో మైలురాయికి చేరుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 620.73 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 78,674.25 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 147.50 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 23,868.80 వద్ద నిలిచింది. దీంతో గత మూడు సెషన్లలో మదుపరుల సంపద రూ.2.53 లక్షల కోట్ల మేర పెరిగింది. 30 షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్‌లు అధికంగా లాభపడ్డాయి. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. లార్జ్-క్యాప్ సూచీల్లో భారీ ర్యాలీ జరగడం వల్లనే సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

# 'ఆర్థికాభివృద్ధిలో సీఎఫ్‌వోలు కీలకం'



హైదరాబాద్, జూన్ 26: ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిలో సీఎఫ్‌వోలు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ఐటీ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సీఎఫ్‌వోల కాన్‌క్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెట్టుబడులపై రాయితీలు అత్యధికంగా అందిస్తుండటంతో భారీ స్థాయిలో ఇన్వెస్ట్‌మెంట్లు వస్తున్నాయన్నారు. ఆర్థిక రంగం తీవ్ర ఒత్తిడికి గురవుతున్న తరుణంలో సీఎఫ్‌వోల కీలకపాత్ర పోషించాలని సీఐఐ తెలంగాణ కన్వీనర్ ఎంవీ నరసింహన్ తెలిపారు.



# రెమిటెన్స్‌లో భారత్ దూకుడు

### 2023-24లో 107 బిలియన్ డాలర్లు..

న్యూఢిల్లీ, జూన్ 26: రెమిటెన్స్‌లు ఆకట్టుకోవడంలో భారత్ దూసుకుపోతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారత్‌లోకి 107 బిలియన్ డాలర్ల రెమిటెన్స్‌లు వచ్చాయి. వరుసగా 100 బిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమించడం ఇది రెండోసారి. విదేశాల్లో విధులు నిర్వహిస్తున్నవారు తమ సంపదను తమ కుటుంబీలకు పంపడాన్ని రెమిటెన్స్‌గా వ్యవహరిస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్లు కలుపుకొని వచ్చిన 54 బిలియన్ డాలర్ల కంటే రెమిటెన్స్‌లు రెండు రెట్లు అధికం. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో 119 మిలియన్ డాలర్లు వచ్చాయి. భారత్‌కు వచ్చిన రెమిటెన్స్‌లో 23 శాతంతో అమెరికా తొలిస్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానాల్లో గల్ఫ్ దేశాలు ఉన్నాయి.